**కథ**

# గులక రాళ్ళు

-'మధూహ'

**"ఒరేయ్** సత్తిగా! ఆ నాలుగు టైర్లు పట్టుకొచ్చి, బయటెట్టరా! ఏడుగంటలు దాటినాది నిదరనొదల్లేవా లేక దగ్గర పాలకొచ్చి నాలుగు తగిలించనా.'' అయ్యి అరుపుతోటి వులికిపాట్నలేచి, కళ్ళు నులుముకుంటూ గుడిసెలోంచి బయటకు వచ్చాడు సత్తిగాడు.

అమ్మకోసం యిటూ అటూ చూశాడు. ఎంతైనా పదేళ్ళు దాటని చిన్నవాడు కదా! అమ్మకోసం తాపత్రయం. సహజానికి విరుద్ధంగా మసలలేడు వాడైనా, ఎవరైనా. అప్పటికే పనికి పోయినట్లుంది అమ్మ. బక్కెట్లోని నీళ్ళతో ముఖం కడుక్కుని చొక్కాతోనే తుడుచుకున్నాడు. దానికున్న చినుగులు తుడుపుకి అడ్డురాలేదు. గుడిసెకి కొంచెం దూరంలో పేవ్‌మెంట్‌మీద రోడ్డు మీదకి ఆక్రమణ అనడానికి వీలులేని విధంగా చిన్న పంక్చర్ షాపు.

"అయ్యా! యిదిగో టైర్లు, ఏడబెట్టను?" నెమ్మదిగా రెండు చేతులతో రెండు టైర్లు తెచ్చాడు. వాడిచొక్కా లాగే మాసిపోయి నలిగిపోయి వున్నాయి.

"ఒరేయ్ నీకు రోజా చెప్పాలిరా! నాలుగూ ఒకేసారి తేలేవూ? గిట్లయితే పనేం నేర్చుకుంటావు" గదమాయింపుతో అయ్య. అయ్యకో పేరుంది. అదే కోటేశ్వరరావు. చిన్నప్పటి నుంచి అందరూ కోటిగా అని పిలవటం వాడు పలకటం అలవాటయిపోయింది. అదే పని కోటి యిప్పుడు చేస్తున్నది. కొడుకుకి సత్యనారాయణ అనిపేరు పెట్టుకున్న కాడి నుంచి సత్తిగా అని పిలవటం, వాడు పలకటం తెలిసినోళ్ళందరికీ మామూలయిపోయింది.

కోటి గదమాయింపుతో సత్తిగాడు లగెత్తుకెళ్ళి మరో రెండు టైర్లు తెచ్చి, నాలుగు ఒకదాని మీద ఒకటి పెట్టాడు కష్టంగా. అవి రోజా ఎందుకు అక్కడ పెట్టాలో సత్తికి తెలియదు. ఎప్పుడూ అడగలేదు. బహుశ అవసరం లేదు కూడా. ఎందుకంటే అక్కడ డబ్బులిస్తే చెమటోడ్చునకి వుదయం నుంచి రాత్రి వరకు రకరకాల

**"ఒరేయ్ నీకు రోజా చెప్పాలిరా! నాలుగూ ఒకేసారి తేలేవూ? గిట్లయితే పనేం నేర్చుకుంటావు" గదమాయింపుతో అయ్య. అయ్యకో పేరుంది. అదే కోటేశ్వరరావు. చిన్నప్పటి నుంచి అందరూ కోటిగా అని పిలవటం వాడు పలకటం అలవాటయిపోయింది.**

వెహికల్స్ బాగుపడి, బాగుచేసేవాడి బతుకు బండిని పట్టించుకోకుండా, తుర్రుమంటాయన్న చిరుపాటి ఆలోచన సత్తిగాడి చిన్నిపాటి బుర్రకి తట్టకబోవటం పెద్ద ఆశ్చర్యపోవలసిన విషయం కాదు.

♦♦♦

ఆవలిస్తూ టైర్ల ప్రక్కనే చిన్న స్టూల్ మీద కూర్చున్నాడు సత్తి. ఆకలేస్తోందని అయ్యని అడిగితే, రాతిరి మిగిలిన బువ్వలో వుల్లటి మజ్జిగ పోసుకు తినమంటాడు. రోజా అది మామూలే. అమ్మ నాలుగిళ్ళల్లో పని ముగించుకొని వచ్చేసరికి ఎంత లేదన్నా సూరీడు నెత్తిమీదకొస్తాడు. అదే వాడికి తెలిసిన సమయం.

అమ్మ ఏమన్నా పనికాడి నుంచి నాలుగు రకాలు తెచ్చిన రోజు సంతసమే సంతసం. మజ్జిగన్నం కూడా పరమాన్నం లెక్కవుంటది ఆ చిట్టి పొట్టకి. అమ్మ చేతిలో బువ్వ ఎంత చల్లనో వాడు వర్ణించలేడు కాని ఆనందాల ఆనవాలు కళ్ళల్లో చూపించగలడు. ఆలోచనలకి చిన్న బ్రేక్ వేస్తే, దూరంగా ఎవరో బండి తోసుకుంటూ వస్తున్నారు.

ఆర్కిమెడిస్ 'యురేకా' అన్న లెవెల్లో సత్తిగాడు 'అయ్యా! గిరాకీ వస్తున్నాది' ఏదో సాధించిన ఆనందం. కానీ చాలా మామూలుగా

"శేఖర్‌బాబు చెప్పిండు, ఆ ఆయిడీ కార్డుతో ఐటెక్ సిటీలోనికి పోవచ్చుంట. బయటకాడి నుంచి చూశా ఒకసారి అయ్యతో బస్సులో పోతావుంటే, ఎన్ని లైట్లురా. ఎలుతురే ఎలుతురు. మస్తుగావుండాది."

తీసుకుంటాడు కోటి. ఆ మౌనం సత్తిని నిరుత్సాహపరచినా, చిన్న వయసు మాటలని దాచుకోలేదు; ఉత్సాహాన్ని ఆపుకోలేదు.

◆◆◆

"శేఖర్ బాబు, ఏంటి పొద్దుగాలే బండిని తోసుకొస్తున్నారు. గాలిగట్ల ఏమన్నా పోయినాదా?" అడిగాడు కోటి, చంద్రశేఖర్‌ని గుర్తుపడుతూ. శేఖర్ అదే ఏరియాలో చిన్నప్పటి నుంచి వుంటూ, స్కూల్‌లో చదివే రోజులలో సైకిల్ ట్యూబులో గాలికోసమన్నా, చిన్న చిన్న రిపేరులున్నా కోటి దగ్గరకి రావటం పరిపాటే. యిప్పుడు హైటెక్ సిటీలో బి.టెక్ చదివి, ఏదో కంపెనీలో యీ మధ్యే చేరాడు.

"అవును కోటీ, ముందు చక్రం ప్రొద్దున్నే లేచి చూస్తే అప్పడంలా అణిగిపోయింది. నేనేమో ఎనిమిది గంటల డ్యూటీకి వెళ్ళాలి. కాస్తంత తొందరగా చూడు" చెప్పాడు శేఖర్. మనిషి టక్ చేసుకుని, మెడలో ఐడెంటిటీ కార్డుతో, నల్లటి షూష్, బెల్ట్‌తో టిప్‌టాప్‌గా తయారయ్యాడు.

"అరే సత్తిగా, కుర్చీపట్రా, సార్ కూచోవాలి. అది కూడా చెప్పాల్రా. యిటు వంటివి పత్తేకంగా చెప్పనక్కర్లా, చూసి నేర్చుకోవాలా!" మళ్ళీ నోటి వెంట గదమాయింపు సత్తిలగెత్తుకెళ్ళి గుడిసె కాడి నుంచి మడత యినుపకుర్చీ పట్టుకొచ్చి వేశాడు. ప్రక్కనే మాసిన గుడ్డతో కుర్చీ మీద దుమ్ము దులపబోతే శేఖర్ వద్దని చెప్పాడు.

"అదేంటి బాబూ. పెద్దోరు కూకోండి. సత్తిగా నువ్వుకొంచెం ప్రక్కమాల కెళ్ళు, నేను దులుపుతా" అన్నాడు కోటి. "అట్లా వాడిని కసురుకోకు కోటీ! నేను ఈ చిన్న బల్లమీదే కూర్చుంటాను. చిన్నప్పుడు ఎప్పుడూ కూడా అదే అలావటు కదా నాకు" చెప్పాడు శేఖర్.

◆◆◆

శేఖర్ మెడలో వేలాడుతున్న ఐ.డికార్డు దాని మీద చిన్ని ఫోటో కించిత్తు ఆశ్చర్యమనిపించినా సత్తికి అడగాలన్న ఉత్సాహాన్ని ఆపుకున్నాడు. ఆరోజు సాయంకాలం చెరువు గట్టున మట్టి దిబ్బల దోస్తులకి చెప్పినప్పుడు వాడి కళ్ళల్లో ఏదో ఎనిమిదో వింత. (వీడికి ఏడు వింతలు తెలియక పోయినా) మిగిలిన దోస్తులు కీ యిచ్చినట్లు, అప్పటి వరకు ఆడి అలసిపోయారేమో మట్టిలో చెరువు వైపు కాళ్ళు బారజాపి వాళ్ళు వాళ్లు చూసిన ఎనిమిదో వింతలని వివరించటం మొదలు పెట్టేసరికి బురదలో కప్పలు బెకబెకలాడి సమయాన్ని గుర్తుచేశాయి.

అవేవీ పట్టించుకోకుండా సత్తిపండు గట్టుమీద చిన్న చిన్న రాళ్ళని చెరువులో బలంగా విసరటం మొదలుపెట్టాడు. రేపు అయ్యకి తెలియకుండా శేఖర్ దగ్గర ఐ.డి కార్డొకటి అడిగి తీసుకోవాలి. అప్పుడు కానీ దోస్తుల ముందర యిజ్జత్ పెరగదు. ఒక రాయిని మించి యింకొక రాయి దూరంగా పడుతుంటే, ఏదో సాధించిన తృప్తి. మధ్యలో మొదలైన అలలు చెరువు గట్టు చివరకంటా తాకాలన్న తాపత్రయం.

"చీకటి పడతావుంది పోదామరా!" అన్నాడు వెంకి సత్తిగాడి దోస్తు, మట్టి చేతులు చొక్కాకి దులుపుకుంటూ, అప్పటికి అందరూ వెళ్ళారు వారి వారి చిన్నపాటి గుడిసెల వైపు.

"శేఖర్‌బాబు చెప్పిండు, ఆ ఆయిడీ కార్డుతో ఐటెక్ సిటీలోనికి పోవచ్చుంట. బయటకాడి నుంచి చూశా ఒకసారి అయ్యతో బస్సులో పోతావుంటే, ఎన్ని లైట్లురా. ఎలుతురే ఎలుతురు. మస్తుగావుండాది." చెప్పుకుంటూ నడిచాడు వెంకి పక్కన.

"అరే నీ పిచ్చిగాని, ఈ చినిగిన గుడ్డలతో లోనికి పోదామనే ! లోపల ఏముంటాదో తెలియకుండానే. మీ అయ్యకి తెలిస్తే కాళ్ళు యిరగ్గొట్టి , మూల కూకో బెడతాడు. ఆ వూసెత్తకు" సత్తిగాడి ఆశలని నీరు గార్చాడు వెంకి.

అవకాశం రాకగాని లేకపోతే వెంకి మాత్రం ఆశపడడూ అనుకున్నాడు మనసులో సత్తి.

✦✦✦

అమ్మ పెట్టిన బువ్వ తీనుకుని, నిద్రకి వుపక్రమించాడు సత్తి. ఎక్కడో రేడియోలో పాట వినిపిస్తోంది 'చదువురాని వాడవని దిగులు చెందకు.' 'అవును అయ్యా బడికి పోవద్దన్నా నాకేటి, చదువుకోకుంటే, నాకేంటి ఐటెక్ సిటీలోనకి వెళ్ళటానికి అయిడీ ఒకటి సంపాదించి, హాయిగా వుంటా' యిదే ఆలోచనలతో నిద్రలోకి జారాడు అమాయకపు ఆవలింతల నడుమ.

రగ్గుకున్న చినుగులోంచి రివ్వుమంటున్న చలిగాలికి తోడు, చెవులకేమాత్రం యింపుగాలేని దోమ సంగీతం. "యివన్నీ నన్నేమీ చేయలేవు. త్వరలో నేను ఐటెక్ మనిషినైపోతా' సత్తిగాడి నోటివెంట గురకభాష. ఆశకి భాషరాదు; హద్దులు లేవు.

వుదయాన్నే ఎప్పటిలానే వచ్చిన సూరీడు కిరణాల వేడి, అయ్య మాటలలో వాడితో నిద్రలోంచి వులికిపాటు సత్తికి. హైమాస్ట్ లైట్ల వెలుతురంత కలవరింతలో ఈదుతున్న వాడి ఆశల నావకి లంగరేసినారు ఎవరో! శేఖర్ ఆ టైముకంతా అటే వెళ్ళాలి. సత్తి కళ్ళలో వెతుకులాట కనురెప్పలు యింత చేసుకొని ఎదురు చూపులు. ఏ స్పీడుతో పోయినాడో చూసుకోలేదు అయ్యకి పనిలో సాయపడేటంతలో.

రోజులు గడుస్తున్నాయి శేఖర్ జాడలేదు. యిల్లు ఎక్కడో తెలిసినా వెళ్ళే ధైర్యం లేదు. 'ఎలా కలిసేది శేఖర్ బాబుని' అనుకుంటూ 'అయ్యని అడిగి చూస్తే' ఒకింత సంశయం.

మధ్యాహ్నం వేళ సత్తి ఆలోచనల నిశబ్దాన్ని భగ్న పరుస్తూ అటువేపుగా కొంతమంది స్కూలు పిల్లలతో మరికొంత మంది పెద్దవాళ్ళు కర్రముక్కలకి గుడ్డలతో ఊరేగింపు.

'బాలకార్మిక వ్యవస్థ నశించాలి' 'బాలలచే పని చేయించటం చట్టరీత్యా నేరం' 'చదువుకోవటం బాలల జన్మహక్కు' అంటూ నినాదాలు. వాళ్ళు అరిచే వాటిలో ఏదో పిల్లల గురించి చెబుతున్నారని గ్రహించగలిగాడు

వుదయాన్నే ఎప్పటిలానే వచ్చిన సూరీడు కిరణాల వేడి, అయ్య మాటలలో వాడితో నిద్రలోంచి వులికిపాటు సత్తికి. హైమాస్ట్ లైట్ల వెలుతురంత కలవరింతలో ఈదుతున్న వాడి ఆశల నావకి లంగరేసినారు ఎవరో! శేఖర్ ఆ టైముకంతా అటే వెళ్ళాలి.

సత్తి (ఊరేగింపుతో పిల్లలు వున్నారుగా). కానీ, ఆవడి చిన్న బుర్రలోకి వ్యవస్థలు, చట్టాలు, హక్కులు కూసింత కూడా ఎక్కలేదు. అందుకు సంతోషించేది వాడి అయ్య కోటి అనటంలో ఏమాత్రం సందేహం లేదు.

వూరేగింపు అల్లంత దూరానికి వెళ్ళాక, సత్తి "అయ్యా! ఎందుకు వాళ్ళట్లా అరుస్తున్నారు. ఏం కావాలంట? అందరూ మంచి మంచి బట్టలు వేసుకున్నారు. పైగా యింగిలీసు కూడా మాట్లాడుతా వున్నారు" అడిగాడు.

కోటికి అర్థమైనది కొంచెమైనా, గంభీరం నటిస్తూ "ఎవరో స్కూలు పిల్లల్లేరా. పుస్తకాలు సరిగా దొరకటం లేదని, అయ్య అమ్మలతోటి ఎవరో పెద్ద ఆఫీసరు కాడికి వెళతావున్నారు. అయినా అవన్నీ నీకర్థం కావుగాని. పని నేర్చుకోవటం మీద ధ్యాస వుంచు" అన్నాడు.

అప్పుడే పని నుంచి వస్తున్న సత్తి వాళ్ళ అమ్మ "నువ్వు గిట్లనే వాడికి అబద్దాలు చెప్పుకుపో! తెలిసినంతలో వాడికి నాలుగు మంచి ముక్కలు నేర్పించరాదూ! అయినా బడి మానిపించి పనిలో ఎందుకు పెట్టినట్లు. నువ్వు ఎట్టానో కష్టపడుతున్నావు. వున్న ఒక్క బిడ్డడు నీలాగే తయారవ్వాలా!" రుసరుసలాడింది కోటి మీద.

ఎందుకు అడిగానురా బాబోయ్ అనుకుంటూ బిక్కమొహం వేయటం సత్తిగాడి వంతయింది. రోజూ ఏదో ఒక వంకతో అయ్య అమ్మల మధ్య కొట్లాటలెందుకు వస్తాయో తెలుసుకునేంత

"శేఖరుసారు మెడలో అయిడీ కార్డు, ఫోటో తోటి వుంటుందే అది ఒకటి యిప్పించయ్యా! అదుంటే ఐటెక్ సిటీ బిల్డింగ్‌లోకి పోవచ్చుంట. మా దోస్తుల కాడ మాటిచ్చిన"

విజ్ఞత వాడికెక్కడిది. తెలుసుకుందామని ప్రయత్నించేటంతలో తెల్లారిపోతుంది. మళ్ళీ మామూలుగా ఎవరి పనులు వారివి.

మధ్యాహ్నం బువ్వ తిన్నాక కోటి కొంచెం సేపు నడుం వాలిస్తే, షాపు చూసుకునే వంతు సత్తిగాడిది. ఆ కాసింత టైముకి, ఆ చిన్ని సామ్రాజ్యానికి వాడే రారాజు. సంపాదన ఏమీ లేకపోయినా.

✦✦✦

అయ్య నిద్రలేచాక మంచి మూడ్‌లో వుంటాడని తెలుసుకోగల సత్తి మనసు, కోటి పక్కన జేరి "శేఖరు సారు అగుపడటం లేదేంటి, అయ్యా!" నెమ్మదిగా సణిగాడు.

"నాకేం ఎరకరా! పెద్దోడయిపోయినాడు. పంక్చర్ గట్ల ఏమన్నా గయితే యాద్ కొస్తాం. చిన్నప్పుడంటే సైకిల్‌కి ఏమైనా లగెత్తుకు వచ్చేటోడు. అయినా కారుగాని ఏమన్నా కొన్నాడేమో. యిప్పుడు ఆ బాబు సంగతి గురుతు చేస్తున్నావేమి" అడిగాడు కోటి.

చెప్పాలా, వద్దా అన్న సందిగ్ధంలో "ఏం లేదయ్యా శేఖరుసారుని అడిగి ఒకటి తీసుకోవాలి. అదేందో చెబితే నువ్వు అరవమాకు మళ్ళా. గట్లయితేనే చెబుతా" చెప్పక పోయినా అరిచి, కొప్పడి అదేందో రాబడతాడు కోటి.

"కొప్పడనులే బిడ్డా! చెప్పు" సత్తికి శేఖర్‌తో ఏం పనుందబ్బా అనుకుంటూ మనసులో.

"శేఖరుసారు మెడలో అయిడీ కార్డు, ఫోటో తోటి వుంటుందే అది ఒకటి యిప్పించయ్యా! అదుంటే ఐటెక్ సిటీ బిల్డింగ్‌లోకి పోవచ్చుంట. మా దోస్తుల కాడ మాటిచ్చిన"

సత్తి కళ్ళల్లో సంతోషం. "శేఖర్‌బాబే చెప్పిండు. అల్లప్పుడు పంక్చర్ కోసం వచ్చినప్పుడు. నేనడిగితే చెప్పిండు."

"ఒరేయ్ సత్తిగా! అది కావాలంటే మంచిగా చదువుకోవాలా, మంచి వుద్యోగం చెయ్యాల్రా! నీ బోటి, కాదులే మన బోటోళ్ళకి యివ్వరురా" సత్తి బిక్కమొహం వేయటం చూసి, "అదుగో నువ్వట్ల మబ్బులా కూచోమాకు, నాకు చిరాకేస్తుంది. కాస్తంత మొహం కడుక్కునిరా. నేనెట్లాగో అయిడీ కార్డొకటి యిప్పిస్తాలే. మళ్ళీ మీ దోస్తులొస్తారు. ఆడుకోవటానికి పోవా, ఏంది!" నెమ్మదిగా చెప్పుకొచ్చాడు కోటి.

✦✦✦

ఆరోజు రాత్రి సత్తి నిదురపోయాక, వాడి అమాయకపు కోరిక పెళ్ళాంతో చెప్పాడు "ఏం చేయాలో పాలుపోవటం లేదు. నువ్వు చెప్పి చూడరాదటే. తల్లి మాట వినకుండా వుండడు. అయిడీ కార్డు నేనెక్కడ తెచ్చి పెట్టేది. మనకెవరు యిత్తారు!"

"శేఖర్‌బాబు వాళ్ళింటికి వెళ్ళి అడగరాదూ! పాత వేమన్నావుంటే యిస్తాడు. కాసేపు ఆడుకుంటాడు బిడ్డ. రేపో మాపో ఆ బాబుచేతే మళ్ళీ చెప్పిద్దాం. యిదంతా వుత్తిదేనని" చెప్పింది సత్తిగాడి అమ్మ.

"గట్లనే" అనుకుంటూ శేఖర్ యింటివైపు బయలు దేరాడు కోటి. శేఖర్‌తో జరిగినది చెబితే....

"మీ వాడంటే చిన్నపిల్లాడు. నీకన్నా అర్థంకాలేదా కోటీ. నా దగ్గర పాతకార్డులు కొన్ని వున్నాయి. యివ్వకూడదు. యివ్వడానికి అభ్యంతరంలేక కాదు. అవి నిజంగా వాడనుకున్నట్లు పనికిరావు. ఆరోజు వాడడిగినది నా మెడలో కార్డు గురించి. వాడి అమాయకత్వం చూసి నవ్వొస్తోంది."

"కాదయ్యా! నాకూ గట్లనే అనిపిస్తోంది. కానీ వాడిని చిన్న బుచ్చటం యిష్టంలేక గిట్ల వచ్చినా. ఏదో కాసేపు తృప్తితో ఆడతాడు. వాడమ్మ కోరిక కూడా అదే. తరువాత మీయిష్టం" బతిమాలినట్లుగా అడిగాడు.

చిన్నప్పటి నుంచి తెలిసినవాడు కదా! కోటి కోరిక కాదనటం ఎందుకని "వుండు యిస్తాను" అంటూ లోపలి నుంచి కార్డు ఒకటి తెచ్చి, దాని మీద నంబరు చెరిపి, "సత్తికి నేనిచ్చానని చెప్పు" అంటూ కోటికి యిచ్చాడు శేఖర్.

కోటికి తన బిడ్డడు చిన్నతనంతో అడిగిన పెద్ద కోరిక తీర్చబోతున్నందుకు ఆనందం అంతా యింతా కాదు. తండ్రి మనసు అంత కఠినం కాదు. కానీ ఆ కార్డు సత్తిగాడు ఐటెక్ సిటీలోకి వెళదామన్న ఆశ తీర్చదు. అని ఎలా చెప్పాలి, "ఆ శేఖర్ బాబు చేతే చెప్పిస్తే సరి." అనుకుంటూ యింటి దారి పట్టాడు.

✦✦✦

మరునాడు సాయంత్రం వేళ సత్తి దోస్తులతోటి ఆడుకోవడానికి వెళుతున్నప్పుడు కోటి పిలిచి, శేఖర్ యిచ్చిన అయిడీ కార్డు చేతిలో పెట్టాడు. వాడి సంతోషానికి అవధుల్లేవనిపించేటట్లు గెంతులేశాడు. పదేపదే కార్డుని తడిమి చూసుకొని మురిసిపోయాడు.

దోస్తులకి చూపటానికి చెరువు కాడికి లగెత్తు కెళ్ళాడు. 'ముందుగా వెంకీగాడికి చూపించాలా' సత్తి వెళ్ళేసరికి నలుగురైదుగురు గుమిగూడి, వీడి రాక కోసం ఎదురు చూస్తున్నారు.

వెంకి కార్డు చూడంగానే "ఏరా! యిది నీ అయ్య శేఖర్‌బాబు దగ్గర తెచ్చింది కదూ! నాకెట్లా ఎరుకైనదా! మా అయ్యతో చెబుతుంటే నిన్న రాత్రి గుడిసెకాడ విన్నా. యిది ఎందుకూ పనికిరాదుట. వూరికే నీ సంతసం చూడటానికి ఆ బాబు యిచ్చిండంట. నువ్వు ఆశబడ్డట్టు ఐటెక్‌కి దర్వాజా లేదు యిందులో." చెప్పాడు కవ్వింపుగా.

ఒక్కసారి గాలి నిండుగా కొడితే బరస్ట్ అయిన టైరులా అయిపోయాడు సత్తి. అయ్య చేతిలో నుంచి వచ్చిన మోసం గిట్ల చేసే అయిడీ కార్డుని చింపలేక చెరువులోకి యిస్సిరేశాడు కసి కొద్ది.

కార్డు మాత్రం వూరుకుంటుందా! సత్తిగాడిని కవ్విస్తూ కనిపించేటంత దూరంలో నీటిమీద తేలుతూ, వూహలతో వూగిసలాడే వాడి మనసుకి అద్దంపడుతోందో లేక అర్థం చెప్పటానికి ప్రయత్నిస్తోందో!

కసితో, కోపంతో సత్తి రాళ్ళతోటి కనిపిస్తున్న కార్డును కొట్టగానే వచ్చే అలలు మాత్రం చెరువుగట్టు వరకూ చేరాలని ప్రాకులాడుతున్నాయి.

'రేపు' అనే పోరాటంలో ఆయుధం నేటి 'సాధన' అన్న తీరులా!

నీటి కుంటలో ఆసరాలేక మునుగుతున్న సత్తి చేతిలోంచి ఎగిరిపడుతున్న గులకరాయి వాడిని చూసి జాలిగా చెప్పింది. "నీకూ నాకూ తేడాలేదు. ఈ సమాజంలో బతుకు తెరువు కోసం ఒడ్డున వుండాలన్న నీ (నా) అమాయకపు తాపత్రయం నాకు నవ్వు తెప్పిస్తోంది. మిత్రమా! యిద్దరమూ ఆడుకోవటానికి పావులమే! నువ్వు మాత్రం బట్టలు వేసుకున్న గులక రాయివి" వెంటనే బుడుంగుమని శబ్దం.

✤✤✤

ఉ. క్షోణితలంబునెన్నుదురు సోకగ మ్రొక్కినుతింతు సైకత
శ్రోణికి జంచరీకచయ సుందరవేణికి రక్షితానత
శ్రేణికి దోయజాత భవ చిత్త వశీకరణైక వాణికిన్
వాణికి నక్షదామ శుకవారిజ పుస్తక రమ్య పాణికిన్

\- పోతన 'భాగవతం'